## ప్రత్యేక పూల అలంకరణలో ముత్యాలమ్మ



చిల్లకూరు, ఆగస్టు 6, ప్రభాతవార్త

మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసి వున్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం సెలవు కావడంతో మహిళలు, పిల్లలకు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పిల్లలు లేని మహిళలు రావిచెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఇఓ కె. నవీన్ కుమార్, చైర్మన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనా రెడ్డి, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖర్ రెడ్డి, దువ్వూరు సాయి కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త






## గంగమ్మ ఆశీర్వాదంతోనే....!

### -టిటిడి ఛైర్మన్‌గా నియమితులైన భూమన పూజలు



తిరుపతి,ఆగస్టు 6(ప్రభాతవార్త:

తిరుపతినగరగ్రామదేవత తాతయ్య గుంటగంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు స్వయంగా చేపట్టడం....అమ్మ జాతరను అంగరంగవైభవంగా నిర్వ హింపజేయడం వంటివి అమ్మవారి సేవలో తరించడంతోనే ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి గంగమ్మ తల్లి ఆశీస్సులతో టిటిడి ఛైర్మన్ పదవి లభించింది. ఇదే ప్రగాఢ విశ్వాసంతో, ధృఢ సంకల్పంతో టిటిడి ఛైర్మన్‌గా నియమితులైన భూమన ఆదివారం ఉదయం గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు తీర్చు కున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# అంతా పథకం ప్రకారమే..?

### -ప్లానంతా వెల్లడించిన చల్లా పిఏ...
### -వ్యక్తిగత ఇమేజ్ కోసమే పక్కాగా దాడులు



పుంగనూరు,ఆగస్టు 6 ప్రభాతవార్త

రాజకీయమెంతగా మారిపోయిందీ....ఔరా...! అనుకుంటూ జనం ముక్కున వేలేసుకుంటున్నారు...మొత్తానికి ఈనెల 4న జరిగిన చంద్రబాబు రోడ్‌షోలో జనమంతా మంత్రి పెద్దిరెడ్డిదే తప్పని,చంద్రబాబు వస్తే ఈయనకేంటటా అనుకున్నోళ్ళంతా..ఇపుడు ఇదంతా తెలుగుదేశం పక్కా ప్లాన్ అని చల్లాబాబు వ్యక్తిగత పిఏ గోవర్దన్‌రెడ్డి వివరించిన తరువాత హన్నన్నా...అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఈనెల 4న చంద్రబాబునాయుడు రోడ్‌షోకు బందోబస్తులో ఉన్న పోలీసులపై ఎక్కడనుంచో రాళ్ళు,సీసాలు వచ్చిపడడం,వారు గాయపడడం,పెట్రోలతో వాహనాలు తగులపెట్టడం గమనించినపోలీసులు దాడులకు పాల్పడిన 61మందిని వీడియోలల గుర్తించి వెదికి వెదికి మరీ పట్టుకువచ్చి విచారించారు. వీరిలో నియోజకవర్గ తెదేపా కన్వీనర్ చల్లాబాబు వ్యక్తిగత పిఏ గోవర్దన్‌రెడ్డి కూడా దొరికిపోవడంతో ఆయనను విచారించడంతో ఆయన విస్తుపోయే వాస్తవాలను వెల్లడించినట్లు తెలుస్తోంది. ముందస్తుగా ఏమిచేయాలన్న విషయంపై పథకంను చల్లాబాబు ఇంట్లోనే రచించడం జరిగిందనే విషయాన్ని గోవర్ధన్ వెల్లడించారు. చంద్రబాబునాయుడు రోడ్‌షో సందర్భంగా ఎలాగైనా తమ నాయకుడు చల్లాబాబుకు రాష్ట్రవ్యాప్తంగా ఇమేజ్ రావడం కోసం ప్లాన్‌వేశామని, చంద్రబాబుకు పట్టణంలో అనుమతి లేని విషయాన్ని గురించి నానా గొడవ చేయాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగా పోలీసులతో ఘర్షణ పడే సమయంలోనే వారిపై తాను సిద్దంగా తెచ్చుకున్న రాళ్ళు,బాటిళ్ళు,కర్రలతో దాడులు చేయడానికి వ్యూహం చేశామన్నారు. ఈఘర్షణలో పోలీసులు గాయపడితే వారు కాలు ప్రేలకు పాల్పడుతారని, అపుడు ఒకరిద్దరు కార్యకర్తలు చనిపోతే చల్లాబాబుకు పార్టీలోనూ,రాష్ట్రంలోనూ పేరొస్తుందని భావించామని ఆయన వెల్లడించినట్లు పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి,సిఐ అశోక్‌లు వెల్లడించారు. మొత్తంమీద వీడియోలన్నీ క్షుణ్ణంగా పరిశీలించిన మీదట దాడులకు పాల్పడిన 61 మందిని పుంగనూరు పోలీసులు ఆదివారం అరెస్టుచేయగా,ఏ1గా ఉన్న పథక కర్త చల్లారామచంద్రారెడ్డి అలియాస్ చల్లాబాబుకోసం గాలిస్తున్నారు.విధుల నిర్వహణకు వచ్చిన పోలీసులపై దాడులు జరగడం,చాలా మంది గాయపడడం దారుణమని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అందులో రణధీర్ అనే కానిస్టేబుల్ కన్నుదెబ్బతో తీవ్రంగా గాయపడి తిరుపతి అరవింద్‌లో చికిత్స పొందుతుండగా తక్కిన పోలీసులు కోలుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపడంతో పాటూ దిగ్భ్రాంతిని కలిగించిన ఈసంఘటనలో మరిన్ని ట్విస్టలున్నట్లు తెలుస్తోంది.

# చంద్రబాబు వర్సెస్ పెద్దిరెడ్డి

- ★ విద్యార్థి దశ రాజకీయాల నుండి ఇద్దరి మధ్య పోరు
- ★ తన సొంత జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి ఆధిపత్యంపై గుర్రు
- ★ తెలుగుదేశంకు ఊపిరి పోయడానికి 'బాబు' వ్యూహం
- ★ అందరి దృష్టి తెలుగుదేశం పార్టీపై వుండేలా ప్రయత్నం



చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త:

రాష్ట్రానికి 14 సంవత్సరాలు ముఖ్యమంత్రి, సుదీర్ఘకాలం ప్రతిపక్ష నేతగా వున్న మాజీ సిఎం, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు సొంత జిల్లా చిత్తూరులో గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం వుండి తెలుగుదేశం పార్టీ అధినేతగా వున్నప్పటికీ సొంత జిల్లా చిత్తూరులో పట్టు సాధించకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. మరోవైపు యూనివర్సిటీ విద్యార్థి దశ రాజకీయాల నుండి తనకు ప్రత్యర్థిగా వున్న ప్రస్తుత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్తూరు జిల్లాపై పూర్తి పట్టు సాధించి రాజకీయాలు చేస్తుండటంతో ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడుకు మింగుడు పడని పరిస్థితి ఏర్పడింది. అధికార వైకాపాలో ప్రస్తుతం వున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లా స్థాయి నాయకుడే అయినప్పటికీ గతంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాపై పూర్తి ఆధిపత్యం చెలాయించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధినేతగా చంద్రబాబునాయుడు వున్నప్పటికీ ఆయన సొంత జిల్లాలో అప్పట్లో కాంగ్రెస్‌లో వున్న ప్రస్తుత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కట్టడి చేయలేకపోయారు. అప్పట్లోనే ప్రస్తుత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో మెజార్టీ అసెంబ్లీ సీట్లు వచ్చేవి. ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం తరువాత రాష్ట్రంలో జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రస్తుత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలుగుదేశం పార్టీకి చుక్కలు చూపించారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లు దక్కించుకొంటే 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 14 అసెంబ్లీ స్థానాలకు 13 అసెంబ్లీ స్థానాలు దక్కించుకొని తెలుగుదుశం పార్టీకి చుక్కలు కన్పించేలా చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఒక్క కుప్పం నియోజకవర్గం మినహా మిగిలిన అన్ని నియోజక వర్గాల్లో వైకాపా అభ్యర్థులు గెలవడంతో ప్రస్తుత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లాపై పూర్తి పట్టు సాధించి నట్లైంది. ఈ క్రమంలో ప్రతిపక్ష నేత, తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టి కేంద్రీకరించడంతో దేశం అధినేతకు అప్పటి నుండి మంట ప్రారంభమైంది. మాజీ మంత్రి చంద్రబాబునాయుడుకు కంచుకోటగా ప్రఖ్యాతి గాంచిన కుప్పంలో గత రెండేళ్ళ క్రితం జరిగిన పంచాయతీ, జడ్పీటిసీ, ఎంపీటిసీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రస్తుత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతృత్వంలో అధికార వైకాపా జెండా రెపరెపలాడింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన సొంత నియోజకవర్గం కుప్పంను టార్గెట్ చేయడంపై మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు జీర్ణించుకోలేని పరిస్థితిలోకి వెళ్ళారు. ఈ క్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని టార్గెట్ చేసిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం పుంగనూరు వెళ్ళి విరుచుకుపడినట్లు తెలుస్తోంది. పోలీసులు మాజీ ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ పుంగనూరు పట్టణంలోకి లేకపోయినా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు కావాలనే అక్కడికి వెళ్ళడానికి పోలీసులను రెచ్చగొట్టారని పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో చిత్తూరు జిల్లా రాజకీయాల్లో పట్టు సాధించడానికి ఇటు తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు చేస్తున్న రాజకీయాలు ఫలిస్తాయా! అటూ ప్రస్తుత వైకాపా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జరిపే రాజకీమ మంత్రాంగం ఫలితాలు ఇస్తాయా! అనేది చూడాల్సి వుంది.

# షార్ శాస్త్రవేత్తల్లో ఆనందం



శ్రీహరికోట (తడ), ఆగస్టు 6 ప్రభాతవార్త

శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రంలో చంద్రయాన్-3 ప్రయాణం ఎప్పటికప్పుడు ఆనందాన్ని తీసుకొస్తోంది. తాజాగా చంద్రయాన్-3 క్షేమంగా చంద్ర కక్ష్యను చేరుకోవడంతో శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో ఇప్పటికి 80 శాతానికి పైగా విజయం సాధించినట్లేనని సంబర పడుతున్నారు. గత నెల 14న శ్రీహరికోట నుంచి ప్రయోగించిన చంద్రయాన్-3 శాస్త్రవేత్తలు ముందుగా పేర్కొన్నట్లే చంద్రుని వైపు పయనించింది. తాజాగా చంద్ర కక్ష్యలో దీర్ఘ చతురస్రాకారంలో తిరుగుతోంది. ఆదివారం రాత్రి మొదటి ఆర్బిట్ రైజింగ్ ఆపరేషన్ నిర్వహించారు. దీనితో మరో నాలుగు రౌండ్లను దీర్ఘ వృత్తాకారంలో పూర్తి చేసుకొని చివరిగా వృత్తాకారంలో చంద్రుని చుట్టూ పరిభ్రమిస్తుంది. ఈ నెల 17న కీలకమైన మరో ఆపరేషన్‌తో చంద్రయాన్-3ని చంద్రునికి అత్యంత దగ్గరగా చేరుస్తారు. 23వ తేదీ అసలుసిసలైన సాఫ్ట్ ల్యాండింగ్ ఉంటుంది. శ్రీహరికోటలో ఈ ప్రయోగం గురించి శాస్త్రవేత్తలతో పాటు ప్రతి ఉద్యోగి, కార్మికుడు కూడా ఎప్పటికప్పుడు ఆసక్తిగా తెలుసుకుంటూనే ఉన్నారు.

## సెప్టెంబర్ 18 నుండి
# కాణిపాకం బ్రహ్మోత్సవాలు



కాణిపాకం, ఆగస్టు 6 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో సెప్టెంబర్ 18 నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా ఆలయంలో 21 రోజుల పాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయి. ఇందులో భాగంగా సెప్టెంబర్ 18న వినాయకచవితి, 19న ధ్వజారోహణం, హంసవాహనసేవతో ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలు 27న జరిగే ధ్వజావరోహణం కార్యక్రమంతో ముగుస్తాయి. అలాగే 28న అధికార నంది వాహనంతో ప్రారంభమయ్యే ప్రత్యేక ఉత్సవాలు అక్టోబర్ 8న జరిగే తెప్పోత్సవంతో ముగియనుంది. ఈమేరకు 18న వినాయక చవితి, 19న ధ్వజారోహణం,హంసవాహనసేవ, 20న బంగారు నెమలివాహన సేవ, 21న మూషికవాహన సేవ, 22న బంగారు చిన్నశేషవాహనం, బంగారు పెద్ద శేశవాహనసేవ, 23న చిలుక వాహనం (పగలు), వృషభవాహనసేవ రాత్రి, 24న గజవాహన(ఏనుగు)సేవ, 25న రథోత్సవం, 26న బిక్షాండి, తిరుకళ్యాణం, అశ్వవాహన సేవ, 27న ధ్వజావరోహణం, వడాయత్తుఉత్సవం, ఏకాంతసేవ జరుగనుంది. అదేవిధంగా ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా 28న అధికార నందివాహనసేవ, 29న రావణ బ్రహ్మ వాహనసేవ, 30న యాళివాహనసేవ, అక్టోబర్ 1న విమానోత్సవం, 2న సూర్యప్రభ వాహనసేవ, 3న చంద్రప్రభ వాహనసేవ, 4న కామధేను వాహనసేవ, 5న కల్పవృక్ష వాహనసేవ, 6న పూలంగిసేవ, 7న పుష్పపల్లకి సేవ, 8న తెప్పోత్సవం జరుగనుంది. ఈఉత్సవాలను విజయవంతం చేయడానికి ఆదివారం ఉభయదారుల సమావేశం నిర్వహించి ఏర్పాట్లుపై చర్చించారు.

# ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఉద్యోగానికి రాజీనామా చేయాలి

### -బిసివై అధ్యక్షుడు రామచంద్రయాదవ్

పుంగనూరు,ఆగస్టు 6 ప్రభాతవార్త :



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిసివై అధ్యక్షుడు రామచంద్రయాదవ్

జిల్లా పోలీసు ఎస్పీ రిషాంత్‌రెడ్డి తన ఉద్యోగాన్ని రాజకీయలబ్ధి కోసమే అంకితం చేశారని, ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేసి వైకాపాకు సేవలు చేయాలని బిసివై అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ సూచించారు. ఆదివారం ఉదయం ఆయన పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు రోడ్‌షో సందర్భంగా జరిగిన దారుణాలకు జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి ప్రధాన కారణమన్నారు. జిల్లాలో నేరాలను అదుపుచేయలేకపోగా ఆయన రాజకీయాలలో తలదూర్చి అధికారపార్టీకు అనుగుణంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో చోరీలు, గంజాయి,ఎర్రచందనం సమస్యలు అధికంగా ఉన్నప్పటికి వాటిని గురించి ఎస్పీ ఏనాడూ చర్యలు తీసుకోలేదన్నారు. తాను విజయవాడ సభముగించుకుని వస్తుంటే, తిరుపతి ఎస్పీ, చిత్తూరు ఎస్పీలు తమకు అడుగడుగునా తీవ్ర అవరోధాలు కల్పించారన్నారు. చంద్రబాబు రోడ్‌షో వద్ద చెలరేగిన అల్లర్లు కారణంగా పోలీసు సిబ్బంది కూడా గాయాలపాలయ్యరన్నారు. పోలీసు సిబ్బంది,అధికారులను కూడా ఎస్పీ రిషాంత్‌రెడ్డి, పెద్దిరెడ్డికు రాజకీయలబ్ధి చేకూర్చడానికి ఉపయోగించుకున్నారన్నారు. ఎస్పీ నైతిక విలువకు తలొగ్గి వెంటనే రాజీనామాచేయాలని డిమాండ్‌చేశారు.కార్యక్రమంలో చనకంటి సాంబమూర్తి, ఆర్.హరినాథరెడ్డి,అనిల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జనానికి కావాల్సింది బియ్యమే! నరారూపరాక్షసుడు కాదు

### నా అవినీతి ఆరోపణలపై శివయ్య సన్నిధిలో ప్రమాణం చేస్తావా?
### చంద్రబాబునాయుడు విమర్శలకు దీటుగా ఎంఎల్‌ఏ సమాధానం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న

శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలో ప్రాజెక్టుల విధ్వంసంపై రణభేరి సభలో తెలుగుదేశం పార్టీ నాయకుడు నారాచంద్రబాబునాయుడు విమర్శలకు శాసనసభ్యుడు బియ్యపుమధు సూధనరెడ్డి దీటుగా సమాధానం చెప్పారు. ఆదివారం పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగుదేశం నాయకులపై శివమెత్తారు. 'జనానికి కావాల్సింది బియ్యమే కాని నరరూపరాక్షసుడు కాదని చంద్రబాబునాయుడుపై ధ్వజమెత్తారు.పుణ్యక్షేత్రం నడిబొడ్డులో వచ్చి పచ్చి అబద్దాలు మాట్లాడిన చంద్రబాబూ! నీకు దమ్ముంటే ధైర్యం ఉంటే ఇక్కడకు వచ్చి శివయ్య సన్నిధిలో ప్రమాణం చేస్తావా? అని సవాలు విసిరారు.సైకిల్ కాదు కదా చివరకు ఆ సైకిల్‌కు ఉన్న వాల్‌ట్యూబ్ కూడా నీది కాదనే సత్యం నీకు తెలియదా? అని ప్రశ్నించారు. ఈ గుర్తుని ఎలా మీ మామ నుంచి జయప్రదంగా లాక్కున్నావో అందరికి తెలుసునని విమర్శించారు. చంద్రబాబునాయుడుకు ఆయన కొడుక్కు ఇద్దరికి మేటర్ లేదు కానీ జూనియర్‌ఎన్‌టిఆర్ వస్తే తప్ప తెలుగుదేశం పార్టీకి జీవం లేదన్నారు.

#### నా బొజ్జ నాకష్టార్జితం:

నాకు బొజ్జ వచ్చిందని ఎద్దేవా చేసావు. అది నా కష్టార్జితంతో పెరిగింది. నీలాగ 30 సంవత్సరాల అవినీతితో ఇసుక మాఫీయ,ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ బొజ్జని పెంచుకోలేదన్నారు.నేను రియల్ ఎస్టేట్ వ్యాపారినే మా మంత్రి పెద్దిరెడ్డి కాంట్రాక్టరే కొత్త ఏమి ఉందని ప్రశ్నించారు. ఎపి నార్త్ కొరియా తెలంగాణ సౌత్ కొరియా అని వ్యాఖ్యానించారు. చంద్రబాబూ నువ్వు కిమ్ లాంటి వాడివి సొంత కుటుంబసభ్యులనే అంతం చేసేమనస్తత్వం నీదని చంద్రబాబునాయుడును విమర్శించారు. నిన్న కేటిఆర్ నిన్ను 420 అని తెలంగాణ అసెంబ్లీలో ప్రకటించారన్నారు. 40ఏళ్ళ రాజకీయం చేసిన నువ్వు సభ పెడితే 6వేల మంది వచ్చారు. 4 సంవత్సరాలు సేవలందించిన తన జన్మదిన సంబరాలకు 80 వేల మంది హాజర య్యారంటే జనం నాడి తెలుసుకో అంటున్నారు.శివయ్య సన్నిధిలో పులిహోర తిన్నా సొమ్ములు చెల్లిస్తు న్నాను. కేకులుగా తిన్నది నువ్వు మూడు తరాల రాజకీయం అంటూ పొగిడిన బొజ్జల కుటుంబానికి కుడిఎడమలుగా ఉన్న వారే అని అందరికి తెలియదా? అని మధుసూధనరెడ్డి ఛాలెంజ్ చేసారు.




# "బాలాజీ రిజర్వాయర్" ముందుకు కదిలేనా!?

### -తిరుమల,తిరుపతికి తాగునీటి ప్రాజెక్టు కలగానే మిగులుతుందా??

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

"దాహం వేసినపుడే బావి త్రవ్వుతారా"!అనే చందంగా తిరుమల,తిరుపతి వాసులకు శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి "బాలాజీ రిజర్వాయర్"ను చేపట్టేందుకు తీర్మానించినా, ఈ పనులు గత నాలుగేళ్ళుగా ముందుకు కదలడంలేదు. ఈ పనులు పూర్తయి రిజర్వాయర్ నిర్మాణం జరిగితే వర్షాభావ పరిస్థితుల్లోనూ తిరుమల,తిరుపతి వాసులకు తాగునీటి కొరత రాదనే ఉద్దేశ్యంతో ప్రతిపాదనలు సిద్దమయ్యాయి. కరకంబాడి వద్ద ఈ రిజర్వాయర్‌ను3.082 టిఎంసిల నీటిసామర్థ్యంతో నిర్మిస్తే 1 టిఎంసి తిరుమల తాగునీటి అవసరాలకు మరో 2 టిఎంసిల నీటిని మల్లెమడుగు ప్రాజెక్టుకు పంపి అటు తాగునీరు ఇటు 55వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే అవకాశం ఉంటుంది. గత తెలుగుదేశం ప్రభుత్వం బాలాజీరిజర్వాయర్ ప్రాజెక్టు ప్రతిపాదనలు చేసి పనులు మొదలుపెట్టింది. 2018నాటికి ఈ రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో సిద్దం చేయాలని అటు ప్రభుత్వం ఇటు టిటిడి యాజమాన్యం భావించినా ఇప్పటికీ పనులు సాగి ఆగిపోయాయి. ఈ పనులు ఏ కారణంతో ఆగాయనేది అధికారవర్గాలు సమాచారం ఇవ్వలేకపోతున్నా రిజర్వాయర్‌కు అడుగడుగునా అడ్డంకులు తగిలి ఎండమావిగానే మిగిలిపోయే పరిస్థితి లేకపోలేదనేది జనంలో చర్చ. పుణ్యక్షేత్రం తిరుమలకు దేశవిదేశాల నుంచి రోజుకు లక్షమందివరకు భక్తులు వస్తున్నారు. నాలుగుసంవత్సరాల క్రిందట తిరుమలలో నీటి సమస్య ఎదురైనపుడు బాలాజీరిజర్వాయర్ నిర్మాణంపై టిటిడి పాలకమండలి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి, ఈ రిజర్వాయర్ పనులు వేగవంతం చేయడానికి సుముఖత చూపారు. 2019లోనే బాలాజీరిజర్వాయర్ పరిస్థితిని టిటిడి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ప్రభుత్వ నీటిపారుదలశాఖ అధికారులతో కలసి పరిశీలించారు. తిరుమలకు భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తకుండా, శాశ్వత పరిష్కారానికి ప్రత్యామ్నాయంగా బాలాజీ రిజర్వాయర్ ప్రధానమని భావించారు. 1టిఎంసి నీటిని తిరుమల తాగునీటి అవసరాలకు వినియోగించు కోవాలనేది టిటిడి అధికారుల ఆలోచన. 2019వ సంవత్సరం నుండి వరుసగా ప్రతి ఏడాది వరదలు, బలమైన వర్షాలతో తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాలు గోగర్భండ్యామ్, పాపవినాశనం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార తీర్థాలు ఇబ్బంది లేకుండా నీటిసామర్థ్యంతో ఉంటున్నాయి. మళ్ళీ ఈ ఏడాది నవంబర్, డిసెంబర్‌లో వర్షాలుకురిస్తే జలాశయాలకు పూర్తిస్థాయిలో నీరుచేరే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బాలాజీరిజర్వాయర్ గురించి పక్కనపెట్టేశారు.టిటిడి బోర్డు ఈ రిజర్వాయర్‌కు నిధులు విడుదల చేసి ముందుచూపుతో వ్యవహరిస్తే తిరుమలకు రానున్న రోజుల్లో నీటిసమస్య ఎదురయ్యే పరిస్థితి ఉండదని ఇంజనీరింగ్ విభాగం నిపుణుల అభిప్రాయం.

## యువకుడు దారుణ హత్య



సత్యవేడు, ఆగస్టు 6,ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలోని పివి పంచాయితీలో కొత్తకండ్రిగ వద్ద యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రంగరాజ గుంట గ్రామానికి చెందిన డిల్లీబాబు సరోజమ్మల చిన్న కుమారుడు పి మునిశేఖర్(27) బంధువుల ఇంటికి వెళ్ళి వస్తుండగా దారుణ హత్యకు గురై మరణించినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న సిఐ శివకుమార్ రెడ్డి, ఎస్ఐ పురుషోత్తం రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. యువకుని మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం సత్యవేడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతుడు గతంలో వాలంటీర్ పనిచేసి, వాలంటీర్ ఉద్యోగాన్ని వదిలిపెట్టి ప్రస్తుతం శ్రీసిటీ లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యుల అక్రమ సంబంధంలో చోక్యం చేసుకున్న నేపథ్యంలో యువకుడు హత్యకు గురైనట్లు గ్రామస్తులు చర్చించు కుంటున్నారు. పోలీసులు విచారణలో మృతికి గల కారణాలు, వాస్తవాలు వెలుగు చూడాల్సి ఉంది.

## చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నాసిరకం వైద్య సేవలు

చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త:




చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని 33 సంవత్సరాల పాటు అపోలో వైద్య సంస్థకు లీజుకు ఇవ్వడంతో ఆసుపత్రిలో రోగులకు నాసిరకం వైద్యం అందుతుందని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వెళ్తున్న రోగులకు సరైన వైద్యం అందడం లేదని, మందులను బయట కొనుగోలు చేసుకోవాల్సిందిగా వైద్యులు చీటిలు రాసి ఇస్తున్నారని ఆరోపించారు. అలాగే ఆసుపత్రిలో రుమటాలజీ, ట్రామ కేర్ వంటి సదుపాయాలు లేదన్నారు. ఆపోలో సంస్థ నిర్వాకంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి పలమనేరుకు మారే ప్రమాదం వుందన్నారు. ఫలితంగా చిత్తూరులోని రోగులకు ప్రభుత్వ వైద్యం దూరం అయ్యే అవకాశం వుందన్నారు. అలాగే చిత్తూరు రైల్వేస్టేషన్ అమృత్ స్కీమ్‌లో వుందని, అయితే స్టేషన్‌లో లిఫ్ట్, ఎస్కిలేటర్ వంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఫలితంగా వృద్ధులు, స్త్రీలు, పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తమ సంస్థ వంద మందితో సంతకాలు చేసి స్టేషన్‌లో సౌకర్యాలు కల్పించాలని వినతి చేసినా రైల్వే అధికారులు ఇప్పటి వరకు స్పందిచలేదన్నారు. ఈ సమావేశంలో అశోక్,సత్య,కుమరేషన్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

## తెదేపా కార్యకర్త మృతి..చంద్రబాబు తరపున ఆర్థికసాయం

శాంతిపురం, ఆగస్టు 6 ప్రభాతవార్త



మండలంలోని కర్లగట్ట పంచాయతీ చీమనపల్లికి చెందిన తెదేపా కార్యకర్త తిమ్మప్ప మృతి చెందారు. ఈయన మృతి పట్ల తెదేపా అధినేత చంద్రబాబునాయుడు సంతాపం తెలిపారు. తన తరపున అంత్యక్రియలకోసం పదివేల రూపాయలు ప్రకటించగా స్థానిక టిడిపి యూనిట్ ఇన్‌చార్జ్ రుద్రప్ప, అధ్యక్షుడు గిరిధర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ చంద్ర, బూత్ ఇన్‌చార్జ్ మురుగయ్యలు పదివేల ఆర్థికసాయంను మృతుడి కుటుంబానికి అందించారు. కాగా తిమ్మప్ప కుటుంబానికి ఎమ్మెల్సీ భరత్ తరపున వైకాపా నేతలు సైతం పదివేల ఆర్థికసాయాన్ని అందించారు.

## అసౌకర్యాల నడమ వి.కోట ఆర్టీసీ బస్టాండు.. ప్రజల అవస్థలు

వి.కోట, ఆగస్టు 6 ప్రభాతవార్త



వి.కోట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో అసౌకర్యాల నడమ ప్రయాణీకులు, జనం తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. సమీపంలోని హోటళ్ల నుంచి తెచ్చి వ్యర్థాలను బస్టాండ్ సమీపంలో పడేస్తుండడంతో దుర్వాసన వస్తోంది. మరో పక్క వర్షాలకు బస్టాండు ప్రాంగణం బురదనీటితో నిండిపోతోంది. ప్రయాణీకులు కూర్చునేందుకు సైతం కుర్చీలు చాలక ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సౌకర్యం లేకపోగా మరుగుదొడ్ల నిర్వహణ గురించి మాట్లాడకపోతేనే మంచిది. ఆర్టీసీ ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి వి.కోట బస్టాండులో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## 'దేశం' అధినేత దిగజారి రాజకీయం

పాలసముద్రం, ఆగస్టు 6 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దిగజారి రాజకీయం చేస్తున్నారని పాలసముద్రం మండల వైకాపా నాయకులు సుమన్‌రాజు ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పుంగనూరు పర్యటనలో ఎస్పీ రిశాంత్‌రెడ్డిని హేళనగా మాట్లాడటం అవివేకమన్నారు. జిల్లాలో పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా నిర్వహిస్తుంటే వారిపైనే తెలుగుదేశం ఆరోపణలు చేయడం పద్దతి కాదన్నారు. రానున్న ఎన్నికల్లో కుప్పం నుండి తెలుగుదేశం అధినేత పోటీ చేస్తే ఓటమి చెందడం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

## నేడు పోలీస్ స్పందన

చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమం ఈ వారం సైతం నిర్వహించనున్నారు. ప్రజలు తమ సమస్యలపై వినతులను ఎస్పీ రిశాంత్‌రెడ్డిని కలిసి సమర్పించి పరిష్కరించుకోవచ్చును.

## హెడ్మాస్టర్ల సంఘ అధ్యక్షుడిగా బి.అరుణ్‌కుమార్

చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త:



ఎపి హెడ్మాస్టర్ల సంఘ అధ్యక్షుడిగా ఐరాల మండలం ఎం.పైపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ బి.అరుణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిత్తూరు డిఇఓ కార్యాలయం ప్రక్కన వున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎపి హెడ్మాస్టర్ల సంఘ జిల్లా కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా బి.చెంగల్‌రాజు వ్యవహరించారు. సంఘ ప్రధాన కార్యదర్శిగా వి.కోట మండలం పామిగానిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ సి.రవీంద్రనాథరెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా తుమ్మింద జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ కె.హేమాద్రిలు ఎన్నికయ్యారు.

## హాస్టల్ విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

బంగారుపాళ్యం, ఆగస్టు 6 ప్రభాతవార్త:



స్వర్గీయ మాజీ ఎంపి ఎన్‌పి చెంగల్రాయ నాయుడు 110వ జయంతి పురస్కరించుకొని ఆదివారం ఆయన కుమారుడు మాజీ ఎమ్మెల్యే ఎన్‌పి వెంకటేశ్వరచౌదరి హాస్టల్ విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. స్థానిక ఎన్‌పిసి పార్కు నందు ఈ విద్యా సామాగ్రిని జిల్లా న్యాయ సేవా సమితి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణకుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. బంగారుపాళ్యంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్ళల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థి, విద్యార్థినిలకు ఈ విద్యాసామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ మాట్లాడుతూ అన్ని దానాల కంటే విద్యా దానం గొప్పదని, పేద విద్యార్థులకు సేవా భావంతో విద్యా సామాగ్రిని అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ జయచంద్రనాయుడు, మాజీ సర్పంచ్ సురేంద్రనాయుడు, ఉప సర్పంచ్ కమలనాధరెడ్డి, నాయకులు ధరణి, శ్రీనివాసులు, రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీళ్ళ కుంటలో మట్టిని త్రవ్వేస్తున్నారు

బంగారుపాళ్యం, ఆగస్టు 6 ప్రభాతవార్త:



మండలంలోని చీకూరుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మంచినీళ్ళ కుంటలోని మట్టిని పలువురు తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై మండల రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన జయకుమార్ జెసిబిల ద్వారా కుంటలోని మట్టిని తరలిస్తూ డబ్బులు సంపాదించుకొంటున్నారని వారు ఆరోపించారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు స్పందించి మట్టి తరలింపును అడ్డుకోవాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వాలీబాల్ కేరాఫ్ పుంగనూరుపేరు స్థిరపడాలి

-విశ్రాంత డిఎస్పీ సుకుమార్‌బాబు

పుంగనూరు,ఆగస్టు 6 ప్రభాతవార్త :

దశాబ్దాలుగా వాలీబాల్ రంగంలో పేరుప్రఖ్యాతి చెందిందని,పుంగనూరు నుంచి జాతీయ స్థాయి



పోటీలకు పాల్గొన్న క్రీడాకారులెందరో నేటి తరాలకు ఆదర్శమని విశ్రాంత డిఎస్పీ,మాజీ జాతీయవాలీబాల్ క్రీడాకారుడు కనుమకుంట సుకుమార్‌బాబు అన్నారు.పట్టణంలో రెండురోజుల పాటూ జరిగే జిల్లాస్థాయి వాలీబాల్‌పోటీల ప్రారంభంలో ఆయన ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో 1950 ప్రాంతాలలోనే వాలీబాల్ ఆటపట్ల యువకులు ఆకర్షితులయ్యారన్నారు.దేశస్థాయిలో నిష్ణాతులైన ఎందరో కోచ్‌లు ఇక్కడి యువకులకు స్ఫూర్తిని,తర్ఫీదును ఇచ్చారన్నారు. కోచ్ నటరాజ్‌వంటి వ్యక్తుల ఆదర్శంతో వాలీబాల్ క్రీడలో జాతీయస్థాయిలో ఎందరో రాణించారన్నారు. పట్టణ,గ్రామీణ ప్రాంతాల ఔత్సాహికులకు ప్రగతిదాత ఫౌండేషన్ తరపున ఉచితంగా వాలీబాల్ శిబిరాలను ఏర్పాటుచేస్తామన్నారు.మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా మాట్లాడుతూ ఎంపి మిధున్‌రెడ్డి యువసేన అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈపోటీలకు జిల్లావ్యాప్తంగా విశేషస్పందన లభించిందన్నారు. పుంగనూరులో వాలీబాల్,కబడ్డీ క్రీడల కోసం క్రీడాకారుల కోరికమేరకు ప్రత్యేక సదుపాయాల కల్పనకు మంత్రి,ఎంపిలను కోరుతామన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి,ఫకృద్దీన్‌షరీఫ్, ఆర్టీసి మజ్దూర్‌యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి,విశ్రాంత ఉపాధ్యాయులు భరత్‌భూషణ్‌లు ప్రసంగించారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్కూటర్ ర్యాలీ

చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త:




మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆదివారం చిత్తూరు నగరంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు స్కూటర్ ర్యాలీని నిర్వహించారు. చిత్తూరు గాంధీ విగ్రహం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ నగరంలోని ప్రధాన వీధులు తిరిగింది. ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు గోపినాథ్, సత్యమూర్తిలు మాట్లాడుతూ మున్సిపాల్టీల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, పర్మినెంట్ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ధ్వజమెత్తారు. కార్మికుల న్యాయపరమైన కోర్కెలను పరిష్కరించాలని లేకుంటే దశల వారీగా ఆందోళనకు శ్రీకారం చుడ్తామని హెచ్చరించారు. ఈ స్కూటర్ ర్యాలీలో ఎఐటియుసి నాయకులు కె.మణి, దాసరి చంద్ర, కె.రమాదేవి, లత, వాసు, జయశంకర్, సురేష్, వినాయక, ఈశ్వర్, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మళ్లీ భానుడి భగభగలు

కోట,ఆగస్టు6 ప్రభాతవార్త



సదీర్ఘ వేసవితో ఈఏడాది జిల్లా వాసులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం ఆడపాదడపా వర్షాలు కురుస్తుడటంతో వాతావరణం కాస్త చల్లబడింది.గత మూడు రోజులగా భానుడు మళ్లీ ఎండా కాలాన్ని తలపించేలా మండుతున్నాడు. పలు చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరవయ్యాయి. ఆగస్టు లో సాధారణంగా మంచి వర్షపాతం నమోదు కావాలి. అందుకు భిన్నంగా ఉదయం 8 గంటల నుంచే సూరీడు సుర్రీమనిస్తున్నాడు.సాయంత్రం 5గంటలకు కూడా వేడిగాలులు తీవ్రత కొనసాగుతుంది. వరుణుడు ముఖం చాటేయడంతో పాటు ఉష్ణోగ్రలు మరింత పెరగడంతో జనం ఉక్కపోతకు గురువుతన్నారు. తద్వారా విద్యుత్తు వినియోగం పెరుగుతంది. రాత్రుల్లో అనధికారంగా విద్యుత్తు కోతలు విధిస్తుండటంతో ప్రజలు తల్లిడిల్లపోతున్నారు.ఖరీఫ్ సీజన్ కింది సాగు చేసిన పలు రకాల పంటలు వరుణుడి జాడ లేకపోవడంతో వాడు ముఖం పడుతున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## భయం భయంగా.. బయటకు..

కోట,ఆగస్టు6 ప్రభాతవార్త



ఇంట్లో ఉన్నా.. బయటకు వెళ్లినా .. ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు చేసినా .. కుక్కల కాచుకోని ఉంటున్నాయి. ఏమాత్రం అదమరిచినా.. వాటి దాడికి గురికావాల్సిల్సిందే. ఇటీవల గ్రామాల్లో ఈ దాడులు పెరగడంతో .. ప్రజలు భయాందోళన గురవుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. కోట, విద్యానగర్ ప్రాంతాల్లో అడ్డగోలుగా మాంసం దకాణదారుల వ్యర్థ పదర్దాలు అడ్డగోలుగా పడేస్తుటంతో కుక్కలకు విచ్చలవిడిగా మాంసం దొరుకుతుంది.అది దొరకని పరిస్థితిలో పశువులు, మనుషులపై దాడులకు పాల్పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికి ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డులకు నిర్మించినా ..వాటిని సద్వినియోగం చేసుకోవడంలేదు. కోట,విద్యానగర్‌ల్లో చేపలు, కోళ్ల, వ్యర్థాలవిచ్చల విడిగా పడేస్తున్నారు. వాటిని శునకాలు తింటూ మనుషులపై దాడులుకు పాల్పడుతున్నాయి.కోట, ఊనుగుంటపాళెం చిట్టేడు, కేశవరం,రాఘవపుం,కొత్తపాళెం, కొక్కుపాడు, ఉత్తమనెల్లూరు, అల్లంపాడు, వెంకన్నపాళెం,కొత్తపట్నం,తదితర గ్రామాలోల్ల కుక్కల బెడద ఎక్కువగా ఉందిని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పంచాయతీ పాలకులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పంచాయతీల అభివృద్ధి గాలికొదిలేశారు

భాజపా అధ్యక్షులు డా.రమేష్ బాబు

కోట,ఆగస్టు 6 ప్రభాతవార్త

పంచాయతీల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 14,15 ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం మళ్లించడంపై కోట మండల భాజపా అధ్యక్షులు డా.సారంగం రమేష్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం కోటలో విలేకర్లతో మాట్లాడారు.పంచాయతీల అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసి గ్రామాల్లో సర్పంచులు తలెత్తుకోలేని స్థితికి దిగజార్చిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని అందులో భాగంగా సర్పంచులకు నిధులు కేటాంచకుండా వారి హాక్కులను కాలరాసిందన్నారు. దీనిపై ఈనెల 10 న ఛలో కలెక్టరేట్, 17 న చలో విజయవాడ నిర్వహిస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా సర్పంచులు ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.మణిపూర్‌లో రెండు తెగల మధ్య జరుగుతున్న అల్లర్లు తప్ప మతాల మధ్య కాదన్నారు. ఈ అల్లర్లును కూడా కొన్ని పార్టీలు రాజకీయ లబ్ధికి వాడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు,వాసు, వెంకయ్య, వెంకటశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబరు 2 నుంచి ఆడుదాం ఆంధ్ర పోటీలు

కోట,ఆగస్టు 6 ప్రభాతవార్త

మండలంలో అక్టోబరు 2 నుంచి నవంబరు 8 తేదీ వరకు గ్రామ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి వరకు అయిదు విభాగాల్లో ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహించనున్నట్లు కోట మండల విద్యాశాఖధికారి మస్తానయ్య చెప్పారు. ఆయన ఆదివారం ప్రభాతవార్త తో మాట్లాడుతూ కబడ్డీ, వాలీబాల్, ఖోఖో,బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు ఉంటాయన్నారు. 17 ఏళ్ల దాటిన వారే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఇందుకు కమిటిలను వేస్తున్నామని పేర్కొన్నారు. తహిశీల్దార్, ఎంపీడీవో తో పాటు గ్రామ సచివాలయ సిబ్బంది ఉంటారన్నారు. సెప్టెంబరు 1 నుంచి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవవాలన్నారు.

## ఎంఈఓ బాబుకు ఘన సత్కారం

వాకాడు, ఆగస్టు 6, ప్రభాతవార్త




వాకాడు మండల విద్యాశాఖ 18 సంవత్సరాలు పని చేసి బదిలీ అయన ఎన్ బాబును ఘనంగా సన్మానించారు. ఆదివారం వాకాడులోని ఎంఈఓ కార్యాలయం ఆవరణంలోని ఆయన పౌర వీడ్కోలు సభ ఘనంగా మండల విద్యాశాఖ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన సొసైటీ ఛైర్మన్ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఎంఈఓగా బాబు సేవలను ఆయన కొనియాడారు. 18 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో మండలాన్ని విద్య అభివృద్ధి పథంలో ముందంజలో కృషి చేశారు. ఉద్యోగ వృత్తిలో అంకితభావంతో ఆయన పని చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో విద్యను అభ్యసించిన విద్యార్థులు ఉన్నత శిఖరాల్లో ఉన్నారన్నారు. ఎంఈఓ బాబు కృషి అన్నారు. బిజెపి నాయకుడు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ బాబు ఎంఈఓగా ఉన్నప్పుడు తాను సర్పంచిగా మండల పరిషత్తు ఉపాధ్యక్షుడిగా ఉన్నానని ఆయనతో కలిసి పని చేశానన్నారు. ఆయన చేసిన సేవలు మండలంలోని ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఎంపిడిఓ గోపినాథ్ నాయకులు కలిసి ఆయనను ఘనంగా సత్కరించారు. అంతకు ముందు ఎంఈఓ బాబును వాకాడు బజారు నుండి మండలంలోని పని చేస్తున్న ఉపాధ్యాయులు రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా ఊరేగిస్తూ డాన్సు చేపట్టారు.

## ఎరికంబట్టులో సప్రవాహనంపై ఊరేగిన ధర్మరాజులస్వామి

నారాయణవనం, ఆగస్టు 6 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణవనంలో ప్రసిద్ధి చెందిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు ఆదివారం సాయంత్రం సప్రవాహనంపై వెంటకృష్ణపాలెం, ఎరికంబట్టు గ్రామాల్లో ఘనంగా ఊరేగారు. అంతకుముందు ఆలయాన్ని విద్యుత్‌దీపాలు, తోరణాలు, పచ్చనిమామిడి ఆకులతో అలంకరించారు. మేళాతాళాలు, మంగళవాయిద్యాలు, భాణసంచావేడుకల నడుమ ఘనంగా ఊరేగారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని టెంకాయహారతులు, నైవేద్యం హారతులు పట్టారు. అనంతరం స్వామి, అమ్మవారిని దర్శించుకొని టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మధ్యాహ్నం తిరుపతికి చెందిన హరికథ గాణ ప్రవీణ భాగవతారిణి యం.పూర్ణ ఆధ్వర్యంలో మహాబారతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త టిఎస్.సొరకాయులురెడ్డి, మాజీ ధర్మకర్త దేశప్పరెడ్డి, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో సముదాయంలో వాలంటీర్ మృతి

నారాయణవనం, ఆగస్టు 6 ప్రభాతవార్త :



మండలంలోని సముదాయం గ్రామ పంచాయతీలో గ్రామ వాలంటీర్‌గా పని చేస్తున్న లోకేష్ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ వాలంటీర్ పని చేసి ప్రజల మన్ననలను పొందాడు.

## టిడిపికి ఓటు వేద్దాం-బంగారు భవిష్యత్తుకు బాట వేద్దాం

మాజీ ఎమ్మెల్యే హేమలత

నారాయణవనం, ఆగస్టు 6 ప్రభాతవార్త :



వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాట వేద్దామని సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హెచ్ హేమలత పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం మండలంలోని అరణ్యకండ్రిగ పంచాయతీ గోవిందప్పనాయుడుకండ్రిగలో భవిస్యతుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మహాశక్తి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సత్యవేడు టిడిపి మాజీ ఎమ్మెల్యే హెచ్ హేమలత, సత్యవేడు నియోజవర్గ టిడిపి ఇంచార్జీ హెచ్ హెలెన్ హేమలతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తుతో పాటు ప్రతి ఒక్కరికి సంక్షేమం, అభివృద్ధి మళ్లీ పునరుద్దరణ జరగాలంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని సిఎంగా చేద్దామన్నారు. ప్రతి ఒక్కరు కట్టుగా వుండి టిడిపి ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం ఎన్నికలకు సంబందించి చంద్రబాబు విడుదల చేసిన కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇంచార్జీ పి గిరిబాబు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మీ, తెలుగు యువత అధ్యక్షులు లక్ష్మీపతిరాజు, మండల అధ్యక్షులురాలు లత, మండల బిసి సెల్ అధ్యక్షులు ఎస్ఎన్ కందస్వామినాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షులు నరేష్, పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు షణ్ముగం, నాయకులు ఎన్ కందస్వామినాయుడు, కిలారి విజయకుమార్, జయచంద్రనాయుడు, బాలచంద్రనాయుడు, పొన్నుస్వామియాదవ్, సి వాసుదేవయ్య, కృష్ణారెడ్డి, చిన్నిరాజు, ప్రేమ్‌కుమార్, బూత్ ఇంచార్జీ వెంకటసాయి, వెంకటేష్, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## కుమ్మరిగుంటలో గిరిజన కాలనీలో కొత్త దుస్తులు

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్),ఆగస్టు 6 ప్రభాతవార్త



ఏర్పేడు మండలంలోని గిరిజన విద్యార్థులను విద్యావంతులు చేసే ప్రయత్నం యువనేస్తం అసోసియేషన్ నిర్వహిస్తుంది. మండలంలోని పాగాలి పంచాయతి కుమ్మరగుంట గిరిజన కాలనీలో గిరిజన పిల్లలకు కొత్త దుస్తులు అందించారు. దాతల సహకారంతో అసోసియేషన్ అధ్యక్షులు మునిశేఖర్ సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు.ఈ సందర్భంగా మునిశేఖర్ మాట్లాడుతూ నేటికి సమాజంలోని గిరిజనులు విద్య ప్రాధాన్యతను తెలుసుకోలేక పోతున్నారని వివరించారు. వారిని విద్యావంతుల్ని చేస్తే ప్రభుత్వాలు అందిస్తున్న వెసులుబాట్లతో మంచి స్థాయికి వస్తారని వివరించారు.ఈ కార్యక్రమాల్లో సంఘం కోఆర్డినేటర్‌లు అరుణ, నాగమణి,వాలంటీర్లు వెంకటేష్,స్రవంతి, హేమలత, ముత్యాలమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా గొంతుక మూగబోయింది..

-డాక్టర్ యం.ఉమేష్‌రావు

శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త



ప్రజలకోసం తన జీవితాన్నే అంకితం చేసిన ప్రజాగాయకుడు గద్దర్ మృతితో గొంతుక మూగబోయిందని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పాటలతో ప్రజా చైతన్యానికి ఎనలేని కృషి చేసిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని ఉమేష్ పేర్కొన్నారు. తన గళంతో ప్రజలను కదిలించిన గద్దర్ మృతితో ప్రజా ఉద్యమాల్లో పోరహక్కుల పోరాటాల్లో ఓశకం ముగిసినట్లు అయ్యిందని ఉమేష్ తెలిపారు. గద్దర్ కుటుంబసభ్యులకు తన ప్రగాడ సాగుభూతి తెలుపుకుంటూ ప్రజల కష్టాలను పాటల రూపంలో తనదైన శైలిలో బాహ్య ప్రపంచానికి తెలిసేటట్లు చేసిన కళామతల్లి ముద్దుబిడ్డ గద్దర్ ఆత్మకు శాంతి చేకూరాలని ఉమేష్ ప్రార్థించారు.

# తిరుపతి డివిజన్

## శ్రీకాళహస్తి థియేటర్లలో ప్రేక్షకుల నిలువు దోపిడి:

శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త



పుణ్యక్షేత్రంలో ఆహ్లాదానికి,కాలక్షేపానికి సినిమా థియేటర్‌కు వెళ్ళాలంటే ప్రేక్షకులకు దడ పుడుతుంది. కుటుంబంతో సినిమాకి వెళ్ళాలంటే జేబులో కనీసం రూ.వెయ్యి కావాల్సి వస్తుంది. దాంతో పలువురు కేవలం ఇంటిలోని టివిలు, సెల్‌ఫోన్లు డౌన్‌లోడ్‌తో సరిపెట్టుకుంటున్నారు. శ్రీకాళహస్తిలో గతంలో 11 థియేటర్లు ఉండేవి. అవి నేడు మూడుకు పరిమితమయ్యాయి. ఈ మూడు దియేటర్లను కొన్ని సంస్థలు లీజుకు తీసుకొని నిర్వహిస్తున్నాయి. కొత్త సినిమా వస్తే కొంత కాలం టిక్కెట్లు రిజర్వేషన్లతో గందరగోళంగా మారుతుంది. ఆన్‌లైన్లో టిక్కెట్లు 'హౌస్ ఫుల్' అని చూపుతుంది.కానీ టిక్కెట్లను బ్లాక్ చేసుకొని అక్కడ పని చేసే వాళ్ళే కొందరు జేబులు నింపుకుంటున్నారు. మరీ పెద్ద హీరోల సినిమాలంటే పండగే పండగ.థియేటర్లలో సీటింగ్ అస్తవ్యస్తంగా ఉన్నట్లు చెబుతున్నారు.

***తినుబంగారాల ధరలు దడ:***

సినిమా థియేటర్లలో దుకాణాల వద్దకు తినుబండారాలకు వెళితే జేబులకు చిల్లులే.ఈ దోపిడికి బిల్లులు కకూడా అందిస్తున్నారు.లార్జ్ టబ్ రూ.వంద,బిగ్ టబ్ రూ.130లు వెజ్ పుఫ్ రూ.150లు,థమ్స్ అప్ 400 మిల్లిలురూ.360గా వసూలు చేస్తున్నారు.పాప్ కార్న్ పెద్దది రూ.150,చిన్నది రూ.90లు,గా వసూలు చేసుకుంటున్నారు. అదే బయట అయితే పఫ్ రూ.15 నుంచి 20లు పలుకుతుంది.పాప్‌కార్న్ రూ.10లుకు దొరుకుతుంది. ఇక 400 మిల్లిల థమ్స్ రూ.40లు దొరుకుతుంటే థియేటర్‌లోని దుకాణ దారులు ప్రేక్షకులను నిలువు దోపిడి చేస్తున్నారు. పైగా థియేటర్ యాజమాన్యం బయటి వస్తువుల్ని తీసుకెళ్ళకుండా నిషేధిస్తారు. మరి థియేటర్‌లో పరిస్థితులను పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం ఏమైనట్లు అని చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సామాన్య ప్రేక్షకులకు అందుబాటులో ధరలను నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

## గడపగడపకు సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలి..ఎంఎల్ఏ

తొట్టంబేడు, ఆగస్టు 5 ప్రభాతవార్త



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యులు బియ్యపుమధుసూధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తొట్టంబేడు మండలంలోని బంగారమ్మ కాలనీ, ఈదులగుంట గ్రామాల్లో ఆయన పర్యటించారు.ముందుగా ఈసందర్భంగా ఎంపిపి ఉన్నంనిర్మల, మండల కన్వీనర్ వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, సర్పంచ్ సుబ్బయ్యలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంఎల్ఏ ఇంటింటికి వెళ్ళి జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అలాగే అర్హత ఉండి పథకాలు అందని లబ్దిదారులకు వెంటనే ఈపథకాలు అందేందుకు జగనన్న సురక్ష పథకాన్ని సిఎం ప్రవేశపెట్టారని దీన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకోసం నిరంతరం తాను, తన కుమార్తె అందుబాటులో ఉంటానన్నారు. మహిళలు పెద్దఎత్తున ఎంఎల్ఏకు హారతులిస్తూ స్వాగతం పలికి తమ సమస్యలను విన్నవించారు. అనంతరం ఎంఎల్ఏ మధుసూధన్‌రెడ్డిని, ఎంపిపి ఉన్నం నిర్మలను భారీపూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో చంద్రయ్యనాయుడు, వైస్ ఎంపిపి గరటారెడ్డి, మణినాయుడు, వెంకటేశ్వరనాయుడు, సుబ్రమణ్యంనాయుడు, రమణారెడ్డి, అలంకార్, మునికృష్ణ, భాస్కర్‌రెడ్డి, ప్రకాష్, పుట్టామహేష్‌రెడ్డి, గిరిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రారెడ్డి, సంగారెడ్డి, జగదీష్, భాస్కర్, నాగరాజు, మమత, గురవారెడ్డి, రఘురాం, సుబ్రమణ్యం, హరినాయుడు, గంగాధరం, రంగయ్య, మణి, పెంచలయ్య, ధర్మయ్య, మణి, సుబ్బారాయుడు, తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపిడిఓ సురేష్‌బాబు, ఇఓపిఆర్‌డి తరుణాక్షరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం

.తొట్టంబేడు, ఆగస్టు 6 ప్రభాతవార్త

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమణి రామచంద్రాపురం అంగన్‌వాడీ టీచరు సురేఖ తెలిపారు.



మండలంలోని రామచంద్రాపురంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సురేఖ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులోభాగంగా ఈఏడాది కూడా తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సిడిపిఓ శాంతిదుర్గ ఆదేశాల మేరకు తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. బిడ్డపుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు పట్టించాలని అప్పుడే బిడ్డలు ఆరోగ్యవంతులుగా పెరుగుతారన్నారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలని తల్లి ఆరోగ్యంగా ఉన్నపుడే శిశువు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ' పథకాన్ని ప్రవేశపెట్టిందని ఇందులో ప్రతి గర్భిణీస్త్రీకు, బాలింతలకు పదిరకాల పోషకాహారాలు ఇంటివద్దకే అందిస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ మంజుల, జయమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రమాకాంత్ శర్మ, ప్రొఫెసర్ త్రిపురసుందరికి బెస్ట్ పిఆర్ కౌన్సిలర్, టీచర్ అవార్డు

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 6, ప్రభాతవార్త

పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ వ్యవస్థాపక అధ్యక్షుడు సి. రమాకాంత శర్మకు



బెస్ట్ పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిలర్ అవార్డు లభించింది. అదే విధంగా పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ పూర్వ అధ్యక్షురాలు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం జర్నలిజం ప్రొఫెసర్ త్రిపుర సుందరిని బెస్ట్ పబ్లిక్ రిలేషన్స్ టీచర్ అవార్డు వరించింది. పిఆర్ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్, సివిఎన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని బెస్ట్ వెస్టర్న్ హోటల్‌లో 16వ పబ్లిక్ రిలేషన్స్ ఎడ్యుకేషన్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ మీడియా సలహాదారు డా. కెవి రమణాచారి విశిష్ఠ అతిథిగా విచ్చేసి ప్రజా సంబంధాల గొప్పతనాన్ని సోదాహరణంగా వివరించారు. ముఖ్య అతిథులుగా ఐఎఫ్ఎస్ అధికారి రాజశేఖర్, పిఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు అజిత్ పాథక్ సత్యనారాయణ కీలక ఉపన్యాసం చేశారు. అనంతరం డా. రమణాచారి చేతుల మీదుగా రమాకాంత శర్మకు, ప్రొఫెసర్ త్రిపురసుందరికి అవార్డులు ప్రధానం చేశారు. తిరుపతి చాప్టర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరికి అవార్డులు రావడం పట్ల చాప్టర్ చైర్మన్ కె. శ్రీనివాసరావు, కార్యదర్శి డి. చంద్రమోహన్ హర్షం వ్యక్తం చేసారు. అవార్డులు అందుకున్న వారికి అభినందనలు తెలియజేసిన వారిలో చాప్టర్ వైస్ చైర్మన్ చంద్రమోహన్ రావు, ట్రెజరర్ ప్రొఫెసర్ చక్రవర్తి రాఘవన్, మాజీ చైర్మన్లు డాఎస్‌బి సుధాకర్ రెడ్డి, డా. స్వరాజ్యలక్ష్మి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ హర్షవర్ధన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆర్‌సికె రాజు తదితరులు ఉన్నారు.

## టిడిపితోనే మహిళా సంక్షేమం

పుత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త :



మునిసిపాలిటీలోని నాల్గో వార్డు పరిధిలో ఆదివారం తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్.ధనపాల్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మహిళా సంక్షేమానికి కట్టుబడి వుందని తెలిపారు. మినీ మ్యానిఫెస్టోలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం తెలుగు మహిళ కమిటీ సభ్యులు ఇంటింటికీ కరపత్రాలు, పసుపు దారాలు పంచారు. మహిళలతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కేశవాచ్చారి, మహిళా నాయకులు నాగరత్న, లక్ష్మీప్రసన్న, మోహన తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి టిటిడి చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా సన్మానం

తిరుపతి టౌన్, ఆగస్టు 6, ప్రభాతవార్త



తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డికి టిటిడి చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా వైసిపి నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం. గపాల్ రెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి భరణి యాదవ్, గంగమ్మ గుడి మాజీ చైర్మన్ సుదర్శన్ రెడ్డి, వైసిపి నాయకుడు రఘురాం, తిరుపతి వైఎస్ఆర్‌సిపి సోషల్ మీడియా కో కన్వీనర్ మనోహర్ రెడ్డి, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పుపై కాంగ్రెస్‌నాయకుల హర్షం

శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త



ఏఐసిసి మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో గుజరాత్‌హైకోర్టు ఇచ్చిన తీర్పును స్టే విధించడం జరిగింది. అంతేకా కుండా వెంటనే కొనసాగించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎస్.బత్తెయ్య నాయుడు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయం ముందు టపాకాయలు పేల్చి హర్షధ్వానాలు మధ్య మిఠాయిలు పంచుకుని కాంగ్రెస్‌పార్టీ నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జానీబాష, విజయశేఖర్, వెంకటముని, రాఘవరెడ్డి, గోపి, శివయ్య, నాగూరయ్య, రమణయ్య, మోహన్, సురేష్, బాలాజీ వానమ్మ, మస్తానమ్మ, భానమ్మ, మస్తానమ్మ, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దేశం నేతను సత్కరించిన రంగినేని

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి రోడ్‌షోకు వచ్చిన జాతీయ తెలుగుదేశం అధ్యక్షుడు మాజీ ముఖ్య మంత్రి నారాచంద్రబాబు నాయుడును శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి మాజీ అధ్యక్షుడు రంగినేనిచెంచయ్య నాయుడు వేదికపై సత్కరించారు. ఆయనకు పూల కిరీటం ధరింపజేసి దుశ్శాలువతో సత్కరించారు. పార్టీ కోసం ఆహర్నిశలు పాటుపడుతున్న చెంచయ్యనాయుడు బొజ్జల కుటుంబానికి నమ్మినబంటుగా ఉన్నారు. ఈ నేపధ్యంలో ఇటీవలజరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో ఆయన సుధీర్‌రెడ్డితో ఉండటంతో పోలీసు కేసుల్లో ఇరికించారు. సభావేదికపై నారాచంద్రబాబునాయుడును సత్కరించటంతో ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ కిట్ల పంపిణీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త



నియోజకవర్గంలో జనసేన పార్టీ క్రియాశీల సభ్యులకు ఐడికార్డులు, సభ్యత్వకిట్లును నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోట ఆదివారం సభ్యత్వ నమోదు చేసిన వాలంటీర్ సభ్యులకు శ్రీకాళహస్తి పట్టణంలో సమావేశం ఏర్పాటు చేసి అందించారు. క్రియాశీల సభ్యత్వం నమోదు చేసి వాలంటీర్లను దుశ్శాలువతో సత్కరించి వారికి కిట్లను అందించారు. నియోజకవర్గంలో 2100 మంది సభ్యులు రూ.500 కట్టి జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వం పొందినట్లు తెలిపారు. ఈసందర్భంగా వినుత కోట మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బలంగా పోరాడి రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో జనసేన పార్టీ జెండా ఎగరవేయాలని కోరారు. కార్యక్రమంలో కోట.చంద్రబాబు,పలువురు జనసేన నేతలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## వరికి పొట్టదశలో పోటాష్ అవసరం

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 6, ప్రభాతవార్త



జిల్లాలో జూన్‌లో నాట్లు వేసిన వరి, పొట్టదశకు వస్తున్నది. ఈ దశలో ఎకరాకు 35 నుండి 40 కిలోల యూరియాతో పాటు 20 కిలోల పోటాష్ ఎరువు కూడా తప్పక వేయాలని, దీని వలన పంటలో ధాన్యం జల్లు లేకుండా నాణ్యంగా ఉంటుంది. తెల్ల చీడ, మొవ్వ పురుగు వంటి చీడల సమస్య తగ్గుతుందన్నారు. కానీ నేడు పోటాష్ ఎరువు బస్తా ధర చాలా అధికంగా వుండడం వలన రైతులు వరికి పోటాష్ వాడకం తగ్గించారు. ఇది పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనిని అదునుగా తీసుకుని వ్యాపారులు ఆర్గానిక్ పోటాష్ చౌకగా దొరుకుతుందని రైతులకు అమ్ముతున్నారు. కానీ సాధారణ పోటాష్ ఎరువులో 60 శాతం పోటాష్ పోషకం వుంటే, ఆర్గానిక్ పోటాష్‌లో కేవలం 11 – 12 శాతం పోటాష్ పోషకం మాత్రమే వుంటుంది. ఇది తెలియక రైతులు మోసపోతున్నారు. కాబట్టి రైతులు సాధారణ పోటాష్ ఎరువును 20 కిలోలు వేసుకున్నా పంటకు ఎకరాకు 12 కిలోల పోటాష్ పోషకంను 680 రూపాయిలకే అందించవచ్చు. అదే ఆర్గానిక్ పోటాష్ రూ. 800 – 850 ధర పెట్టి వేసినా కేవలం ఆరు కిలోల పోటాష్, పోషకమే అందుతుంది. ఈ వాస్తవాన్ని రైతులు గుర్తించి జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

## వైసీపీ కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరురూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:



పుత్తూరు రూరల్ మండలం కైలాసపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చంద్రబాబు తండ్రి కృష్ణమందడి అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. కృష్ణమందడి మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేశారు. ఆయనతో పాటు పుత్తూరు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, అనిల్ యాదవ్, రాజా, నేసనూరు సర్పంచ్ గోవిందస్వామిరెడ్డి తదితరులు ఉన్నారు.

## ద్రౌపదీదేవి తిరుణాళ్ళలో గాలి భానుప్రకాష్

నగరి, ఆగస్టు 6 ప్రభాతవార్త:



నగరి రూరల్ మండలం కృష్ణారామాపురంలో జరుగుతున్న శ్రీ ధర్మరాజులు ద్రౌపదీసమేత తిరుణాళ్ళలో ద్రౌపదీ దేవి సమేత ధర్మరాజుల తిరుణాళ్ళలో నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ద్రౌపదీదేవి ఆలయంలో పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహా భారతంలో అలరించిన దుర్యోధన వధ

– ఆసక్తిగా తిలకించిన ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
– అన్నదాన కార్యక్రమానికి లక్ష విరాళం

తిరుపతిరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ దుర్గసముద్రం గ్రామ పంచాయతీలోని శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు ఆలయ ప్రాంగణంలో మహాభారత ఉత్సవాలు అత్యంత వేడుకగా సాగుతున్నాయి. ఈ వేడుకలకు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వాహణ కోసం రూ.1లక్ష రుపాయాల నగదును ఎమ్మెల్యే చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అందజేసారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసమై దుర్యోధన వధ ప్రక్రియలో భగవంతుడు శ్రీకృష్ణుడు పాండవుల పక్షాన నిలిచి కీలకపాత్ర పోషించిన వైనం అలరించింది. ఈ ఘట్టాన్ని మోహిత్‌రెడ్డి ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో దుర్గసముద్రం గ్రామ సర్పంచ్ మిట్టపల్లి ప్రసాదరెడ్డి, ఎంపిటిసి మునిరెడ్డి, ఆలయ ఉభయదాతలు పాల్గొన్నారు.

**వేడుకగా మాతమ్మ జాతర**

**– మాతమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి**

తిరుపతిరూరల్ చిగురువాడ గ్రామ పంచాయతీలో మాతమ్మ జాతర అత్యంత వేడుకగా సాగింది. ఆదివారం మాతమ్మ జాతరకు విచ్చేసిన మోహిత్‌రెడ్డికి సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వైకాపా గ్రామ అధ్యక్షుడు ముచ్చేలి ధరణికుమార్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు.

**పాతకాల్వ మహాభారత ఉత్సవాలలో మోహిత్‌రెడ్డి**

తిరుపతిరూరల్ పాతకాల్వ జరిగిన మహ భారత ఉత్సవాలలో ఎమ్మెల్యే చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజును దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అరుణ్‌కుమార్, నాగభూషణం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాతమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన పులివర్తి నాని

రామచంద్రాపురం,ఆగస్టు 6 ప్రభాతవార్త:



బ్రాహ్మణకాలువ ఏఏడబ్ల్యూలో జరుగుతున్న మాతమ్మ తిరునాళ్లను పురస్కరించుకుని ఆదివారం అమ్మవారికి టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పట్టు వస్త్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా ఆయనకు టిడిపి నాయకులు,కార్యక్రర్తలు,గ్రామ పెద్దలు మేళతాళాలు,మంగళ వాయిద్యాలు,డప్పులు వాయిస్తూ,బాణసంచా పేలుస్తూ గ్రామ వీధుల మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి,నాయకులు సురేంద్రనాయుడు,మహేష్‌నాయుడు,కోరా హరిప్రసాద్,రాగల గిరి,కొట్టే గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రౌడీ రాజ్యం పోయి ప్రజల రాజ్యం రావాలిః పులివర్తి నాని

రామచంద్రాపురం,ఆగస్టు 6 ప్రభాతవార్త:



...) టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ...యి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసిపి ...ంగా పులివర్తి నాని పసుపు కండువాలు వేసి ...ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ...మంది అపరిచిత వ్యక్తులు తనపై చేస్తున్న ...స్థానిక ఎమ్మెల్యేకు కులాలు మతాల మధ్య చిచ్చు రేపడం ఆనవాయితీగా వస్తోందన్నారు.వైసిపి నాయకులు ఎన్నికల సమయంలో గ్రామాల్లో చిచ్చు పెట్టడం మంచి పద్దతి కాదని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, సీనియర్ నాయకులు చినబాబు,జనార్ధన్ చౌదరి,ఉమాపతినాయుడు,నారాయణరెడ్డి, కమలాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి,రామిరెడ్డి,హరిప్రసాద్,జయచంద్రనాయుడు,విజయ్‌కుమార్ రాయల్ఛ్ పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అన్ని విధాలా అండగా ఉంటా

**–ప్రెస్‌క్లబ్ సొంత భవనానికి 10 లక్షల ఆర్థిక సాయం**
**–చంద్రగిరి ఎమ్మెల్యే డా॥చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడి**

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 6 ప్రభాతవార్త:



జర్నలిస్టులకు అన్ని విధాలా అండగా ఉంటానని చంద్రగిరి ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ డా॥చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హామీ ఇచ్చారు.ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో ప్రెస్‌క్లబ్ సభ్యులు,వారి కుటుంబ సభ్యులకు మెగా హెల్త్ చెకప్ ఫ్రీ మెడికల్ క్యాంపును నిర్వహించారు.గుండె,రక్త సంబంధిత(2950 రూ॥ల విలువ గల 42 రకాల) పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.ఈ మెగా హెల్త్ చెకప్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి,తిరుపతి రూరల్ ఎంపిపి మోహిత్‌రెడ్డిలు మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ ప్రజలతో పాటు జర్నలిస్టులందరూ కూడా తన కుటుంబ సభ్యులేనని అన్నారు.ఖరీదైన వైద్య పరీక్షలను ఖచ్చితమైన ఫలితాలు వచ్చే ఆధునిక వైద్య పరికరాలతో హెల్త్ చెకప్‌ను నిర్వహించామన్నారు.ప్రెస్‌క్లబ్‌కు ఇప్పటి వరకు సొంత భవనం లేదని,ప్రస్తుత ప్రెస్‌క్లబ్‌కు రెనివేషన్ అవసరమని ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి,బాలచంద్ర కోరారు.దీనికి స్పందించిన ఎమ్మెల్యే..ప్రస్తుత ప్రెస్‌క్లబ్ ఆధునీకరణకు ఖర్చుకు వెనుకాడకుండా అత్యాధునికంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.30 ఏళ్ల చరిత్ర కలిగిన తిరుపతి ప్రెస్‌క్లబ్‌కు సొంత భవనం లేకపోవడం బాధాకరమన్నారు. అలాగే ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి తమ ట్రస్ట్ నుండి 10 లక్షల రూ॥లు అందిస్తానని ప్రకటించారు. .బ్లడ్ రిపోర్ట్స్ రెండు రోజుల్లో వస్తుందని,దీనిపై వచ్చే ఆదివారం ప్రముఖ వైద్యులతో మెగా మెడికల్ క్యాంపును నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి,ఎంపిపి మోహిత్‌రెడ్డిలను ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఘనంగా సత్కరించారు.

## చిల్లీస్‌లో ఘనంగా 'ఫ్రెండ్‌షిప్ డే' వేడుకలు

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 6 ప్రభాతవార్త:



ఆదివారం 'ఫ్రెండ్‌షిప్ డే'ని పురస్కరించుకుని స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్‌లోని చిల్లీస్ రెస్టారెంట్స్ అండ్ హోటల్స్ నందు హోటల్ అధినేత చిల్లీస్ అంజి ఆధ్వర్యంలో ఫ్రెండ్‌సిప్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిల్లీస్ అంజి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయిన స్నేహితులకు పోటీలు నిర్వహించి,ఆ పోటీల్లో గెలుపొందిన స్నేహితులకు బహుమతులు అందచేశారు.అనంతరం పోటీల్లో పాల్గొన్న వారందరికీ బిర్యానీతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా చిల్లీస్ అంజి మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ రెస్టారెంట్‌లో పోటీలు నిర్వహించి మరింత మంది స్నేహితులకు ఆదర్శంగా నిలుస్తున్నామన్నారు.ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయిన స్నేహితుల మధ్య మరింత స్నేహభావాన్ని కలిగించేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.పోటీల్లో గెలుపొందిన స్నేహితులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందచేశారు.ఈ కార్యక్రమంలో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయిన స్నేహితులు,చిల్లీస్ అంజి స్నేహితుడు రాజా పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల విజయవంతంకు ఉభయదారులు సహకరించాలి



## -ఆలయ ఛైర్మన్, ఈఓలు

కాణిపాకం, ఆగస్టు 6 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల విజయవంతంకు ఉభయదారులు సహకరించాలని ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు అన్నారు. సెప్టెంబర్ 18 నుండి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆదివారం స్థానిక మణికంఠేశ్వరాలయంలో ఆలయ ఉభయదారుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 18న వినాయకచవితితో ప్రారంభమయ్యే స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 8న జరిగే తెప్పోత్సవంతో ముగుస్తుందన్నారు. ఈమేరకు సెప్టెంబర్ 19న వినాయకచవితితో ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలు 27న జరిగే ధ్వజావరోహణంతో ముగుస్తుందన్నారు. అలాగే సెప్టెంబర్ 28న అధికార నంది వాహనంతో ప్రారంభమయ్యే ప్రత్యేక ఉత్సవాలు అక్టోబర్ 8న జరిగే తెప్పోత్సవంతో ముగుస్తుందన్నారు. ఈమేరకు ఈబ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని అన్నారు. ఉత్సవాలను గతంలో వలె సంప్రదాయరీతిలో దిగ్విజయంగా నిర్వహించేందుకు ఉభయదారులు సహకరించాలని ఛైర్మన్, ఈఓలు తెలిపారు. ఈసందర్భంగా పలువురు ఉభయదారులు పలు సమస్యలను ప్రస్తావించడంతో సమావేశం రసాబాసాగా మారి అర్ధాంతరంగా ముగిసింది. ఈమేరకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలో సంప్రదాయానికి విరుద్ధంగా ఉద్దేశ్యపూర్వకంగా కింద ప్రచురించారని పలువురు ఉభయదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ప్రతిష్టాత్మకంగా జరిగే బ్రహోత్మవాలలో భాగంగా ఆలయంలో తరతరాలుగా విధులు నిర్వహిస్తున్న గురుకుల్ వంశస్థులచే అలంకరణ పూజాధి కార్యక్రమాలు నిర్వహించాలని స్థానిక ఎంపీటీసీ సుధీర్ డిమాండు చేశారు. ముఖ్యంగా ఆలయ అభివృద్ధికి కోట్లాది రూపాయలు విలువగల భూములను అతి తక్కువ ధరకు అందజేసిన ఉభయదారులకు దేవస్థానం తగిన గుర్తింపు నివ్వడం లేదని మాజీ ఆలయ ఛైర్మన్ జగన్నాధరెడ్డి ధ్వజమెత్తారు. ఆధ్యాత్మిక కేంద్రం కాణిపాకంను ధార్మికంగా అభివృద్ధి చేయాల్సి న ఆలయ అధికారులు పూర్తిగా వ్యాపార కేంద్రంగా ఒక్కో దానికి ఒక్కో రేటు పెట్టి భక్తులను నిలువు దోపిడి చేస్తున్నట్లు పలువురు ఉభయదారులు ఆరోపించారు. ఆలయానికి కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నా భక్తుల కోసం కాని, స్థానికుల కోసం కాని ఇంత వరకు ఒక్క సేవా కార్యక్రమం కూడా చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఇతర ప్రాంతాలలోని వ్యక్తులకు, సంస్థలకు ఎట్టి పరిస్థితులలోనూ దేవస్థానం స్థలాలను కేటాయించడానికి వీలులేదని ఉభయదారులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దేవస్థానం కాంట్రాక్ట్ పనుల కేటాయింపులో ఉభయదారులకు కూడా అవకాశం కల్పించాలని డిమాండు చేశారు. అలాగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం రోజు స్వామివారికి నిర్వహించే అభిషేకం విషయమై ఇరువర్గాలకు చెందిన ఉభయదారుల మధ్య వివాదం నెలకొనడంతో సమావేశం రాసాభాసాగా మారి గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో సమావేశంను అర్ధాంతరంగా ముగించారు. ఈసమావేశంలో స్థానిక సర్పంచ్ కెఎస్. శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్, ఆలయ ఈఈ మురళీ బాలకృష్ణ, ఏఈవోలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి సూపరెండెంట్ రంగస్వామి, ఆలయ మాజీ ఛైర్మన్‌లు మణినాయుడు, జగన్నాధరెడ్డి, మోహన్‌నాయుడులతో పాటు ఆలయ ఉభయదారులు పాల్గొన్నారు.

# ఏఆర్ ఎఎస్పీ నాగేశ్వరరావును పరామర్శించిన ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త:



ఏఆర్ ఎఎస్పీ జి.నాగేశ్వరావును పరామర్శిస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

పుంగనూరు ఘటనలో గాయపడిన ఏఆర్ ఎఎస్పీ జి.నాగేశ్వరరావును ఆదివారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్ళి పరామర్శిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఘటన సమయంలో పోలీసులు చూపిన చొరవ, పాటించిన సంయమనం గొప్పదని పేర్కొన్నారు. ఏఆర్ ఎఎస్పీ జి.నాగేశ్వరరావును ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకొని ఆరోగ్యంతో త్వరలో విధులకు హాజరు కావాలని ఎస్పీ ఆకాంక్షించారు. అలాగే పుంగనూరు ఘటనలో గాయపడి కోలుకొంటున్న అడ్మిన్ ఆర్ఐ నీలకంఠేశ్వరరెడ్డిని ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదివారం ఆయన నివాసంకు వెళ్ళి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్ నీలకంఠేశ్వరరెడ్డితో ఎస్పీ మాట్లాడుతూ ఆరోగ్యంను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

# మణిపూర్ హింసకు నిరసనగా శాంతి ర్యాలీ

పుత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త :



మణిపూర్‌లో ప్రజల హింసాకాండకు నిరసనగా సెయింట్ పాల్ లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. చర్చ్ నుంచి స్థానిక అంబేద్కర్ సర్కిల్ వరకూ జరిగిన ర్యాలీలో చర్చ్ కార్యదర్శి ఆర్.సి.సుధాకర్ మాట్లాడుతూ మత విద్వేషాల పేరిట మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసా కాండను నిలపాలని దీనికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో చర్చ్‌ల కూల్చివేతను నిలిపివేయాలన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న అరాచకం, హింసను అదుపు చేయడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కొండల్లో ప్రశాంత జీవనం గడుపుతున్న గిరిజన అమాయక ప్రజల పట్ల అమానుషంగా వ్యవహరించడం, వారి ఆస్తులను ధ్వంసం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల పట్ల జరిగిన అమానవీయ సంఘటనల వల్ల ప్రపంచ దేశాల్లో భారతదేశం ప్రతిష్టకు భంగం కలిగిందని తెలిపారు. కార్యక్రమంలో బిషప్ జి.డి.సుందర్‌శేఖర్, పిసిసి ఛైర్మన్ చరాస్ చంద్రన్, వైస్ ఛైర్మన్ ఆర్.దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# స్నేహ మేర జీవితం...స్నేహమేర శాశ్వతం

## -కలిసిన చెర్లోపల్లి హై స్కూల్ 1985-86 టెన్త్ బ్యాచ్




తిరుపతిరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:

స్నేహ మేర జీవితం...స్నేహ మేర శాశ్వతం అనే పంథాలో 38 సంవత్సరాల తర్వాత చెర్లోపల్లి హై స్కూల్లో 10వ తరగతిన చదివిన పూర్వ విద్యార్థులు ఒక వేదికపై కలిసి యోగ క్షేమాలు పంచుకున్నారు. చిన్ననాటి స్నేహ బంధాన్ని నెమరు వేసుకున్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పైడిపల్లి వద్ద ఓ మామిడితోపు కలిసి ఆనందంగా గడిపారు. అప్పుడప్పుడేను నూగు మీసాల వయస్సులో కలిసి మెలసిన తిరిగిన ఆ విద్యార్థులు 38 సంవత్సరాల తర్వాత మీసాలు వెరసే వయస్సులో కలిసి ఉత్సాహంగా గడిపారు. అలనాడు చేసిన అల్లర్లు, చిలిపి చేష్టలు గుర్తు చేసుకోవడమే కాకుండా ప్రస్తుతం ఎవర్వేరు ఎలా ఉన్నారు...ఏ ఏ రంగాలలో స్థిరపడ్డారు...ఎవరి పిల్లలు ఏమి చదువుతున్నారు, అనే విషయాలను ఒకరి నోకరు అడిగి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులలో ఎవరైన ఇబ్బందుల్లో ఉంటే తగిన సహాయ, సహకారాలు అందించాటనికి నిర్ణయించారు. అలాగే పూర్వ విద్యార్థులు సమాజ సేవ చేయటానికి సిద్ధమని తెలిపారు. పూర్వ విద్యార్థులలో మరణించినవారికి మౌనం వహిస్తూ నివాళ్ళు అర్పించారు. ప్రతి ఏడాది స్నేహితుల దినోత్సవం తర్వాత మొదటి ఆదివారం కలుస్తామని స్నేహితులు తెలిపారు.

### గురువులకు ఘనంగా సన్మానం

చెర్లోపల్లి హై స్కూల్లో 1985-86లో పదో తరగతి చదివిన విద్యార్థులు తమ గురువులైన మునికృష్ణారెడ్డి, లక్ష్మీ చోడమణి, సుధాకర్‌నాయుడు ఇతర గురువులను ఘనంగా సన్మానించి, గరుభక్తిని చాటుకున్నారు. ఎప్పటిలాగా కాకుండా ఈసారి గురువులను స్నేహితుల దినోత్సవం నాడు సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం మధ్యాహ్నం సామూహికంగా భోజనాలు చేసారు. ఈ కార్యక్రమంలో చెర్లోపల్లి హై స్కూల్లో 1985-86లో పదో తరగతి చదివిన విద్యార్థులు గుత్తా కోటేశ్వరనాయుడు, కొత్తపాటి మునీశ్వరరెడ్డి, జానకిరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రమ్మ, జ్యోతి, మురళి, వెంకటమునిరెడ్డి, హేమలత, శ్రీదేవి మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

# స్నేహమంటే విడదీయలేని బంధం!

## -నలభైఏళ్ళ క్రిందటి విద్యార్థులు కలయిక



తిరుపతి, ఆగస్టు 6ప్రభాతవార్త:

స్నేహానికి మరో అర్థం లేదని, ఎంతటి కష్టమొచ్చినా బంధుత్వాన్ని మించినది స్నేహమని నలభైసంవత్సరాల క్రిందటి పదవతరగతి విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన కలుసుకుని అనుబంధం గుర్తుచేసుకున్నారు. తిరుపతి నెహ్రూ మున్సిపల్ ఉన్నతపాఠశాలకు చెందిన 1983-84 సంవత్సరం పదవతరగతి విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా వివిధ హోదాల్లో, పలు రకాలుగా స్థిరపడినా తమ స్నేహబందాన్ని గుర్తుచేసుకుని అభినందనలతో ఒక్కచోట కలిశారు. సిపిఎం నేత కందారపు మురళి, నగరపాలకసంస్థ ఆర్ఓ కె.లోకేశ్వరవర్మ, అర్జున్ ఎలక్ట్రికల్స్ అధినేత అర్జున్, జయచంద్ర, అశోక్, ఆర్ఆర్ శ్రీనివాస్, గిరిధర్, సుబ్బారావు, కెబి శ్రీనివాస్, డాక్టర్ రామ్‌కుమార్, సురేంద్ర, సుబ్రమణ్యం, గురుమూర్తి, బివి రాయ్, కుప్పస్వామి, చంద్రమౌళి, శీను, చెంగయ్య తదితరులు ఒకరినొకరు చిన్ననాటి రోజులను గుర్తుచేసుకున్నారు.

# భక్తుల సేవలో తరిద్దాం

## -టిటిడి నూతన ఛైర్మన్ భూమనకు అభినందనల వెల్లువ





తిరుమల, ఆగస్టు 6ప్రభాతవార్త ప్రతినిధి:

టిటిడి ధర్మకర్తలమండలి నూతన ఛైర్మన్‌గా నియమితులైన తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డికి అభిమానులు, అధికారులు, అనధికారులు, వైసిపి నేతలు అభినందనలు వెల్లువెత్తాయి. ఆదివారం ఉదయం పద్మావతి పురంలోని ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నివాసంలో ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి, చంద్రగిరి ఎమ్మెల్యే ,ప్రభుత్వ విప్ ,తుడ ఛైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి నగర పాలకసంస్థ కౌన్సిల్ పాలకవర్గం,వైసిపి నేతలు, శ్రేణులతో బాటు టిటిడి అధికారుల బృందం టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మం, తిరుపతి ఆర్డిఓ కనకనరసారెడ్డి, సివిఎస్ఓ నరసింహకిశోర్, ఎఫ్ఎసిఎఓ బాలాజీ, న్యాయాధికారి జస్టిస్ వీర్రాజు, ,అదనపు సివిఎస్ఓ శివ కుమార్‌రెడ్డి, విజిఒ మనోహర్, పిఆర్ఓ డాక్టర్ తలారి రవి , టిటిడి ఉద్యోగుల సంఘం నాయకులు చీర్లకిరణ్, హేమలత, రవికుమార్, గోల్కొండ వెంకటేశం, మునివెంకటరెడ్డి, రామకృష్ణ, హిమకుమార్, అరుణ్, సుబ్బు, బుట్టో తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. టిటిడి ఉద్యోగుల ఇళ్ళస్థలాల సమస్య పరిష్కారం చూపాలని కోరారు.

# బిసిలపై కపట ప్రేమ ఒలకబోస్తున్న కేంద్ర ప్రభుత్వం

**-కుల గణన చేయకపోతే బిజెపికి బుద్ధి చెబుతాం**

**-బిసి ప్రధాని మోడీ బిసిలకు ఒరగబెట్టింది లేదు**

**-బిసి సంక్షేమ సంఘం రాయలసీమ కో-ఆర్డినేటర్ జ్ఞాన జగదీష్**

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 6 ప్రభాతవార్త:



అధికారంలోకి రావడానికి బిసిలపై ఎనలేని ప్రేమ కనబరచి, తీరా అధికారంలోకి వచ్చాక కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కపట ప్రేమ ఒళకబోస్తోందని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాయలసీమ కో-ఆర్డినేటర్ జ్ఞాన జగదీష్ మండిపడ్డారు. ఆదివారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆయా ప్రభుత్వాలు అనుసరిస్తున్న బిసి వ్యతిరేక విధానాలపై తీవ్రంగా విమర్శించారు. పదేళ్లకోసారి దేశ వ్యాప్తంగా జనగణనలో కుల గణన జరగాలని బిసి సామాజిక వర్గంవారు డిమాండ్ చేస్తున్నప్పటికీ దానిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న బిజెపి తాము అధికారంలోకి రాగానే 2021లో జరిగే జనాభా లెక్కల సేకరణలో భాగంగా కుల జనగణన చేపడతామని అప్పట్లో బిజెపి నేతలు పార్లమెంట్ సాక్షిగా హామీ ఇచ్చారు. అయితే ఆ దిశగా బిజెపి నాయకత్వం అడుగులు వేసిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదని దుయ్యబట్టారు. కుల గణన కోసం బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జాతీయ ఓబిసి నాయకులు అనేక పర్యాయాలు నిరసన ర్యాలీలు, మహా ధర్నాలతో పాటు పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాలు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. చట్ట సభల్లో రాజకీయ రిజర్వేషన్లతో పాటు, కేంద్రంలో ఓబిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, మండల కమిషన్ వెలికితీసి అందులోని మిగిలిన అంశాలను పూర్తిగా అమలు చేస్తారని ఆశించిన బిసి వర్గానికి నిరాశే మిగిలిందని విచారం వ్యక్తం చేశారు. వీటన్నిటి పరిష్కారం కోసం నేడు సోమవారం మండల్ డే సందర్భంగా స్థానిక మహతి ఆడిటోరియం నందు ఉదయం 10 గంటలకు జాతీయ ఓబిసి మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర బిసి నాయకులు బాబన్ వాడ్, జస్టిస్ ఈశ్వరన్, కేశన శంకరరావు, జాజుల శ్రీనివాస్‌గౌడ్ మరియు జాతీయస్థాయి బిసి నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

# గద్దర్ మృతి పీడిత వర్గాలకు తీరని లోటు

శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త



గద్దర్(ఫైల్‌ఫోటో)

ప్రజానౌక గద్దర్ మృతి పీడిత వర్గాలకు తీరని లోటని జననాట్యమండలి మాజీ సభ్యులు, ఆయన అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు పలువురు మాట్లాడుతూ హక్కులు హరించబడుతున్న ఈసమాజానికి తన మాట, పాట ద్వారా అలుపెరుగని పోరాటం చేసిన విప్లవ వీరుడు గద్దర్ అన్నారు. గద్దర్ తుదిశ్వాస వరకు పీడిత వర్గాల విముక్తికోసం పనిచేశాడన్నారు. ఈ పోరాటంలో ఆయన ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని ఈసందర్భంగా వారు గుర్తు చేశారు. గద్దర్ తన పాట ద్వారా పీడిత వర్గాలను విప్లవబాట పట్టించారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గద్దర్ విడదీయరాని బంధం ఉందని ఈసందర్భంగా ఆయన అభిమానులు గుర్తు చేశారు. తెలంగాణా ఉద్యమంలో కూడా గద్దర్ కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన అకాల మరణం తమను తీవ్రమనోవేదనకు గురిచేసిందన్నారు. కార్యక్రమంలో గద్దర్ అభిమానులు వలిపిశ్రీరాములు, గంధంకిషోర్, సుదర్శన్, పాదంశివన్న. శంకర్‌రెడ్డి, కృష్ణంరాజు తదితరులు పాల్గొని గద్దర్ మృతికి విప్లవ జోహార్లు తెలియజేశారు.

గద్దర్ మృతి తీరని లోటు..

ప్రజా నాయకుడు విప్లవకారుడు గద్దర్ మృతి తీరని లోటని టౌన్‌బ్యాంకు ఛైర్మన్ డి.వి.నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల కోసం తన గొంతు ఎత్తిచాటిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన మృతి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

# పెరుగుతున్న ధరలతో బెంబేలెత్తున్న జనం

## పోటీ పడుతున్న టమోటా,చింతపండు



శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త

మళ్ళీ ధరలు విజృంభిస్తున్నాయి. వంటనూనెల ధరలు స్వల్పంగా తగ్గుతున్నాయంటే మళ్ళీ పప్పుల ధరలు పెరుగుతున్నాయి. దాంతో జనం బెంబేలెత్తుతున్నారు. వంట నూనెల ధరలు కిలోకు ఇప్పటి వరకు రూ.10తగ్గింది. అయితే అనూహ్యంగా మహారాష్ట్రలో భారీ వర్షాలతో పప్పుల పంటలు దెబ్బతిన్నాయని కాబట్టి ధరలు పెరుగుతున్నట్లు టోకు వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా నిత్యం వంటలకు వాడే పప్పుల ధరలు పెరుగుతున్నాయి. ఆదివారం మార్కెట్‌లో అందిన సమాచారం మేరకు కందిపప్పు(సచిన్ గోల్డ్) మేలు రకం రూ.160కి పెరిగింది.రెండవ రకం రూ.150కి పెరిగింది. ఇక మినపపప్పు కిలో బ్రాండెడ్ రకాలు కిలో రూ.140కి చేరింది. సాధారణ రకాలు రూ.115 నుంచి 120లకు పలుకుతుంది. వంట నూనెలు కిలోకు రూ.10లు తగ్గితే పప్పులు రూ.50 నుంచి60ల వరకు పెరిగాయి.దాంతో సామాన్యుడు బెంబేలెత్తుతున్నారు.ఇక టమోటాలు, చింతపండు పోటీలు పడి పరుగులు తీస్తున్నాయి. ధరలను ఒకదానికి మించి ఒకటి పెరుగుతున్నాయి.టమోటాలు కిలో రూ.240 పెరిగి ప్రస్తుతం 150కి నిలిచింది. ఇక చింతపండు కరిపులి కిలో రూ.200లకు చేరుకుంది. దాంతో సామాన్యుని పరిస్తితి ఆగమ్యగోచరంగా మారింది.ఇక సబ్బులు, హార్లిక్స్,బూస్ట్‌లు ఆరకిలో బాటిల్‌పై సుమారు రూ.30 నుంచి 40ల వరకు పెరిగింది. దాంతో సామాన్యుడు ఏం తినేది ఏం బతికేది? అని వాపోతున్నాడు.ఇక బ్రాండెడ్ బియ్యపు ధరలు పెరుగుదల ప్రారంభం అయ్యింది. లలితా బ్రాండ్ బియ్యాలు కిలోకి రూపాయి నుంచి రెండు రూపాయలు పెరిగింది. పాలు పెరుగు అన్ని ప్యాకింగ్‌లుగానే వస్తాయి. దాని మీద జిఎస్‌టి విధించటంలో పాల ధరలు పెరిగాయి. దాంతో సామాన్యుడి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

# భూమన కరుణాకర్‌రెడ్డికి మేయర్ దంపతుల శుభాకాంక్షలు



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 6, ప్రభాతవార్త

తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి టిటిడి దేవస్థానం నూతన ఛైర్మన్‌గా నియమితులైన భూమన కరుణాకర్ రెడ్డి ఆదివారం పద్మావతి పురంలో మేయర్ దంపతులు మేయర్ డాక్టర్ శిరీష, డాక్టర్ మునిశేఖర్ కలిసి పుష్పగుచ్ఛం అందించి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు తిరుపతి ఎంపి గురుమూర్తి, తిరుపతి నగర పాలక సంస్థ ఉపమేయర్ భూమన అభినయ్, ప్రముఖ వైద్యులు హరిబాబు, హేమకుమార్, రమేష్ తదితరులు ఉన్నారు.

# శివయ్యకు వెండి గిన్నె బహూకరణ

శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో వాయులింగేశ్వరుడుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరునికి ఆదివారం విశాఖకు చెందిన భక్తులు 700 గ్రాముల వెండి గిన్నెను బహూకరించారు. వైజాగ్‌కు చెందిన రామమూర్తి కుటుంబం నిత్యశివభక్తులుగా ఉన్నారు. వారు శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ప్రతి సేవను జరిపించుకున్నారు. వచ్చిన ప్రతిసారి నిత్యాన్నదాన పథకంలో భోజనం చేసే వారు.ఆదివారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారు ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులును కలసి రామమూర్తి వారి కుటుంబసభ్యులు కలసి తాము శివయ్యకు వెండి గిన్నె విరాళంగా ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిపారు. రూ.65వేల విలువ కల్గిన 700 గ్రాముల వెండి గిన్నెను అందించారు. వారికి ఛైర్మెన్ ప్రత్యేకంగా స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం, వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు ఏర్పాటు చేసారు. వారికి ఏర్పాట్లను ఇన్స్ పెక్టర్ హరియాదవ్, నాగరాజు పర్యవేక్షించారు.

# భూతకి వాహనంపై షణ్ముఖుని రాజసం



శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవాల్లో ప్రధాన ఉత్సవాలు ఆదివారంతో ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరాలయంలో వల్లిదేవ సేన సమేత సుబ్రమణ్యం స్వామిని కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు రాజేష్ గురుకుల్ ముస్తాబు చేసారు.స్వామి అమ్మవార్లను బోయిలు మోసుకొని రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. అక్కడ స్వామి అమ్మవార్లను భూతకి వాహ నంపై ప్రతిష్టించారు.మేళ తాళాలు మంగళవాయి ద్యాలతో తేరువీధి నుంచి ఉత్సవం ప్రారంభం అయ్యింది, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు హారతులిచ్చి ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. ఉత్సవంతో పాటు ఆలయ ఇన్స్ పెక్టర్ సుదర్శనం నాయుడు వారి సహచరులు వెంట రాగా ఉత్సవం నెహ్రూవీధి, బాబూ అగ్రహారం కోనేరు, నగరివీధి, బజారువీధుల గుండా సాగింది. ఈ నెల 8న భరణికి వచ్చే భక్తుల కోసం సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.

# కోనేటి సుబ్బరాజుకు డాక్టరేట్ ప్రదానం



తిరుపతి,ఆగస్టు 6ప్రభాతవార్త:

టిటిడి ఉద్యోగి, కళాకారుడు కోనేటి సుబ్బరాజుకు మైసూర్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈసందర్భంగా కోనేటి సుబ్బరాజు సేవలను అభినందిస్తూ రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సాయి,నవీన్, కృష్ణమూర్తి ఆత్మీయంగా దుశ్శాలువ కప్పి అభినందనలు తెలిపారు.

# ఉపాధి నిధులు వృధా!

## - పశువుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన తొట్టెలు నిరుపయోగం

పాలసముద్రం, ఆగస్టు 6 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలంలో ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. పశువుల దాహార్తి తీర్చడం కోసం గత ప్రభుత్వంలో పశుసంవర్ధకశాఖ ఉపాధి హామీ నిధులతో మండల పరిధిలో నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. పశుసంవర్ధక శాఖ నీటి తొట్టెల నిర్మాణం పూర్తి చేసి ఈ తొట్టెల నిర్వహణను పంచాయతీలకు అప్పగించినప్పటికీ పంచాయతీ అధికారులు ఈ తొట్టెల గురించి పట్టించుకోకపోవడంతో గ్రామంలో ఈ తొట్టెలు దిష్టిబొమ్మలుగా మారాయి. మండలంలోని వనదుర్గాపురం గ్రామ పంచాయతీతో ఉపాధి నిధులు ఖర్చు చేసి పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువుల దాహార్తి తీర్చడం కోసం ఆరు నీటి తొట్టెలు నిర్మించారు. ఒకొక్క నీటి తొట్టె నిర్మాణానికి 20 వేల రూపాయలు ఖర్చు చేయగా ఒక్క వనదుర్గాపురం గ్రామ పంచాయతీ పరిధిలోనే ఈ తొట్టెల నిర్మాణం కోసం 1.20 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. నీటి తొట్టెలు నిర్మించే సమయంలో జాగ్రత్తలు పాటించి నీటి నిల్వ వుండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే నాణ్యత పాటించకుండా తొట్టెలు నిర్మించి పూర్తి చేయడం, పంచాయతీలు తొట్టెల ఆలనా పాలన చూసుకోకపోవడంతో తొట్టెల్లో రాళ్ళు, మట్టి, పాచితో అపరిశుభ్రంగా మారింది. ప్రభుత్వ నిధులను పశుసంవర్ధకశాఖ, పంచాయతీలు దుర్వినియోగం చేసి పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల దాహార్తి తీర్చడం కోసం నిర్మించిన తొట్టెలను ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.



పశువుల దాహార్తి తీర్చడం కోసం నిర్మించిన నీటి తొట్టెలో పాచి నీళ్ళు నిల్వ వున్న దృశ్యం